# ఐ హేట్ శర్మన్స్ |

సౌందర్యం అంటే బ్యూటీ-బ్యూటీ అంటే నేచర్. నేచర్ అంటే గోంగూర-(గోంగూర పచ్చడి కాదు) గోంగూర ప్లస్ సివిలి జేషన్ అనగా పచ్చిమిరపకాయలు ఎండుమిర్చి పోపుపెడితే గోంగూర పచ్చడవుతుంది. పోపు పెట్టడం గొప్పకళ. (రా) మనుషులకు పోపు తగిలిస్తే నాగ్రికులవుతారు. జామకాయలు, చెరకు కర్రలు, బొప్పాయి పండ్లు, దోసకాయలు, తాటి ముంజెలు, సీతాఫలాలు, మామిడిపండ్లు తినడం నేచురల్ మరియు సహజం. దోసెలు, ఇడ్లీలు బొబ్బట్లు మెక్కడం డాక్టర్ కోసం పరుగెత్తడం మోస్టులీ అన్నాచురల్ .... అప్పడాల పిండి ముందు తినేస్తే తర్వాత ముక్కిపోయిన అప్పడాలు కాల్చుకు తినేబాధ తప్పుతుందంటే పిల్లల మాట పెద్దవాళ్ళు చెవిని పెట్టరు.

అఫ్‌కోర్సు గేదలు, ఆవులు, కుక్కలు, కోళ్ళు గుర్రాలు నానా జాతి పిట్టలు అన్నీ నేచురల్‌గా ఉంటాయి. అవి బట్టలు వేసుకోవు.

పసిపిల్లలుకూడా బట్టలు వేయించుకోరు. వేస్తే పీక్కుంటారు, లాక్కుంటారు. దిస మొలతో పరుగెడతారు, మట్టిలోనూ బురదలోను యిసుకలోను ఆడటం వాళ్ళకిష్టం. ఒకవేళ తల్లి యమయాతన పడి ఎలాగో వాళ్ళరూపురేఖలు తీర్చిదిద్దినా, మరుక్షణంలో వాళ్ళ అవతారాలు చూడశక్యంగావుండవు. వుండకపోయినా వాళ్ళే ముద్దొస్తారు. దిసమొలతో తిరిగినా నెత్తిమీద మట్టిపోసుగున్నా నీళ్ళలో ఆడినా, వాళ్ళే బావుంటారు. అందం అంతా వాళ్ళదే- వాళ్ళని క్రమంగా పాడుచేసి- మనంతవాళ్ళని చేయాలని మనం తాపత్రయపడతాం. ప్రకృతి నుంచి ప్రకృతి సహజత్వాన్నుంచి పారిపోయిన పిరికి పందలం మనం- మన పిరికితనమే మన నాగరికత అదే మన సభ్యత : నటీజ్ కల్చర్ —

ఆవు పొదుగుకేసి చూడ్డం అసభ్యంకాదు, చూడుతోవున్న గేదె, ఈనిన పంది, పిల్లల్ని పెట్టిన పిల్లి, పిల్లలకోడి, పావురాల జంట, పురి విప్పుకున్న నెమలి, కొమ్మమీది కోతి, కొబ్బరి చెట్టుమీద కొండముచ్చు, రోడ్డుమీద తిరిగే కుక్కలు వీటికేసి చూడ్డం అసభ్యం కాదు. త్రాచు పాము చాలా అందంగా ఉంటుంది, 'సింహం గొప్ప దర్జాగా వుంటుంది. కుక్కకి పాంటూ, పిల్లికి బుష్ షర్టూ, కోతికి కళ్ళీ లాల్చీ తొడిగి చూడండి. గుర్రానికి లేసు పరికిణీ కుట్టిస్తే ఎలా వుంటుంది? గేదెకి తొమ్మిది గజాల చీర కట్టొచ్చా? ఆవుకి పెద్దాపురం పట్టుచీర కట్టబెడితే? ఇవన్నీ చేసినా వాటికి సభ్యతరాదు. ఆఫ్ కోర్సు-కోతులకి చింపాంజీలకి సర్కస్ వాళ్ళు డ్రెస్‌లు వేస్తున్నారనుకోండి, సర్కస్ అమ్మాయిలకి డ్రెస్‌లు తీసివేస్తున్నారనుకోండి, బట్టలు వేసుకొనేవాళ్ళు అప్పుడప్పుడు ఆ బట్టలు తొలగిస్తుంటే - అసభ్యత అశ్లీలం వాట్ నాట్ అన్నీ అందు లోంచి పుట్టుకొస్తాయి.

వేసుకున్న గుడ్డలు తీసేస్తే అప్పుడు సౌందర్యం నేచురల్‌గా బైటపడ్తుంది. సినిమాల వాళ్ళు పైటలు తీసేస్తారు, వంటి నంటిపెట్టుకునే దుస్తులు వేసి పరుగు లెత్తిస్తారు చెట్ల చుట్టూ - ఏదైనా నేచురల్‌గా వున్నదానికి ఆకర్షణలేదు. పొలాల్లో ఎంత మందో మనుషులు కోక లెగ్గట్టి గోచీలు పోసి పైటలు బిగించి పనులు చేసుకొంటూ వుంటారు. వర్షంలో తడిసిన మనుష్యులు ఆదరాబాదరా ఆడామగా రోడ్లమీద పరుగులెత్తు తుంటారు. ఇంట్లో ఆడాళ్ళు చిన్న బట్టకట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ ఎంగిళ్ళెత్తుతూ కంచాలు కడుగుతూ పనులు చేసుకుంటూ వుంటారు. ఇదంతా అశ్లీలం, అసభ్యం అని మనం గంతులు వెయ్యటం లేదు. ఒక పేరూ వూరూ డబ్బూ దస్కం వార్డ్ రోబునిండా రకరకాల చీరలున్న ఆడది (తారకానివ్వండి) గుడ్డకట్టలేని కడుబీదరాలు కాకపోయి నప్పటికీ తక్కుతూ తారుతూ గెంతు లేస్తూంటే సంగీతం, ఆపాటలూ చెవుల్ని హోరెత్తిస్తూంటే ఆ సంస్కృతి, సభ్యత, మానం మర్యాదా

మంట కలిసిపోతున్నాయని గోలెడుతున్నాం. ఆడదాన్ని బజారులో పెట్టారని అలమటిస్తున్నాం.

డబ్బులిచ్చి చూశాక చూసి లోపల ఆనందించి పైకి అసభ్యం అశ్లీలం అని గావుకేకలు పెడుతున్నాం. దటీజ్ నాట్ కరక్టు మరియు గుడ్. ఇలా కేకలు పెట్టేవాళ్ళంతా పుణ్యాత్ములు, పుణ్యాత్ములంటే వాళ్ళ శరీరాలు పాపాలుచేస్తే చెయ్యొచ్చేమోకాని వాళ్ళ ఆత్మలు పరిశుద్ధమైనవి. బజార్లో పకోడీలు కొనుక్కు తిన్నా వాళ్ళు ప్యూరిటన్స్. టన్నులకొద్ది నీతిపాఠాలు వప్పచెప్పగల్రు.

ఈ సినిమాలు చూసొచ్చి మళ్ళీ స్నానాలు, పుణ్యాహవచనాలూ చేయిస్తారాఅంటేఅదీలేదు. పడకగదిలో మంచానికి తలాటిదిక్కునవెంకటేశ్వరస్వామి పటం వ్రేలాడాల్సిందే. పొద్దున్నే లేవగానే ముందుకనిపించాలట, స్వామివారి మొహం. మరి రాత్రంతా స్వామివారికా శిక్ష ఎందుకు చెప్పండి? వేమన్న ఏమన్నాడూ? తలలు బోడులైన తలపులు బోడులా అని— సినిమాహాల్సునిండా తలలు బోడులైనవారే— ఈలలు చప్పట్లూ గోలా— కేకలూ డాన్సులు లేకపోతే పాటలు లేకపోతే అందరు తారలూ నిండుగా పమిటలు కప్పుకుని ముత్తయిదువుల్లా పేరంటాళ్ళలా కనిపిస్తే, తొమ్మిదిగజాల కోకలు కడితే— చూస్తారా సినిమాలు. అందుకే సినిమాలో ఒక తులసి కోట, దేవుడిబొమ్మా— మధ్యే మధ్యే ఒక భక్తిపాట పెట్టి తతిమ్మా రీళ్ళన్నీ అమ్మాయిలమీంచి లాగించేస్తూంటారు, పుణ్యమూ పురుషార్థమూనూ— ఈ సినిమా తారలంతా పాపం (పాపాలు చేస్కున్నవారే అయితే) ప్రేక్షకుల్ని ఇహమందూ పరమందూ వైకుంఠానికి తీసికెళ్ళి తాము నరకస్థులు కావడం ఖాయం. కాని అలా అవరు— వాళ్ళుకూడా సత్యనారాయణ వ్రతాలూ, పూజలూ, పుణ్యాలూ, తిరుపతి యాత్రలూ, సాయిబాబా భజనలూ చేస్తారు. చందాలిస్తారు, అడ్వర్టయిజుమెంట్లిస్తారు, ఎలక్షన్లలో ప్రచారంచేస్తారు, విరాళాలిస్తారు, పాపపుసొమ్మని మళ్ళీ పుణ్యకార్యాలకు ఖర్చుచేయిస్తుంటారు.

అంచేత దేవుడు అందర్నీ ఓ కంట కనిపెడతాడు. ఈ పుణ్యం పాపాన్ని కొట్టేస్తుంది. అది రూలు. అదెలా? దానికి మరిహ అప్పీలులేదు. దేవుడి పేరు చెప్పి మధురభక్తి అనీ, మట్టిగడ్డలనీ బూతుపాటలు రాసిన వాళ్ళంతా (అవి పాడి ఆడి నాట్యకళ అనీ, నావెత్తికళ అనీ గెంతిన బాపతు భక్తులూ అనురక్తులూ రాగులూ, విరాగులూ) వైకుంఠం చేరుకుంటే, ట్విస్టు డాన్సులూ హిప్పీ కల్చరూ బీటిల్సు మంకీస్ పాటలు డాన్సులు సినిమాల్లోచేసి డబ్బు చేసుకున్నవాళ్ళంతా కూడా స్వర్గానికే వెళ్తారు.

కుర్రాళ్ళు చెడిపోతారంటారు. చెడిపోవడమనగానేమి? అపరిపక్వ మనస్కులు పెడదారులు పట్టే అవకాశం వుంటుందట. మనవూళ్ళో రోడ్లన్నీ హైరోడ్లేనా— ఎన్ని పెడదారులులేవు. పెడదారులు లేకుండా హైరోడ్డును చేరుకోవడం కష్టం; అడ్డరోడ్లు నిలువు రోడ్లు లేకుండా ఏ వూరైనా వుంటుందా— వుండదు. ఎసుమంటి రోడ్డయినా వంకర తిరుగుతుంది. రైలుపట్టాలుకూడా వంకరతిరుగుతాయి. నిత్యజీవితంలో చాలా వుద్రేకం వుంది. బిగింపు వుంది. రొటీను యమ డ్రడ్జరీ— ఈ చచ్చు పుచ్చు ఉల్లిపాయ బ్రతుకు బ్రతుకుతూ ఓ జయలలిత డాన్సో విజయలలిత విన్యాసమో.... కాంచన కంగారో మరో సుందరి తళుకో బెళుకో కాస్సేపు తెరమీదచూపిస్తే తప్పా— మీరు దోక్కుంటారా? కడుపులో త్రిప్పుతోన్నట్లు ఉంటుందా? షిప్పులోనో గనిలో, వనిలో, కార్ఖానాల్లోనో నడుంవంచి ఒళ్ళువిరుచుకు పనిచేసిన కార్మికుని కోసం ఓ పడుచుపిల్ల కాస్త గెంతి నవ్వి, నవ్విస్తే మీరు కళ్ళలో నిప్పులు పోసుకుంటారా? కత్తెరలూ, కత్తులూ, కటార్లూ ఝుడిపిస్తారా? రోజల్లా రిక్షా లాగిన కార్మికుడికి భగవద్గీత శ్లోకాలూ, భజగోవిందం కీర్తనలూ, దేశభక్తి— ఫ్యామిలీ ప్లానింగ్ మరియు పొదుపు ఉద్యమంగురించి ప్రచారం చేయడానికి మీకు సిగ్గు వేయటంలేదా? యౌవనం వయసూ వలపూ ఉమ్మరించే పడుచుది ఆపడ్తే లొట్టలువేస్తూ నీళ్ళుకార్చే మీరు— జనానికి

అదికూడా తెరమీద ఓ కొద్ది నిముషాలపాటు, సరస సంగీత సాహిత్య హృదయైకవేద్యమైన దృశ్యాల్ని చిత్రిస్తే గింజుకుని కంట్లో కలికంపెట్టి నట్లు బాధపడ్తారా? మరైతే మీ పిల్లలు మనుచరిత్ర, నైషధం, ముద్దుపళని కావ్యాలు చదవొచ్చా?—అవన్నీ పండిత పరిష్కృతాలా ? చాల్చాలు! ఈ డబాయింపులు కట్టిపెట్టి నాలుగురోడ్ల మధ్యకు రండి. జీవితం ఎలాటి పరుగుచ్చుకుందో-కాస్త కళ్ళజోళ్ళు మార్చి చూడండి.

లారీలూ. ట్రక్కులూ, బస్సులూ, మోటార్లూ, రైళ్ళు, స్కూటర్లూ, కార్లూ, విమానాలూ చూడండి. వేగానికి కాలానికి జీవితానికి వుండే సంబంధం లెక్కలుకట్టి తేల్చండి. సామాన్యుడు ఎలా నలిగి పోతున్నాడో. ఒక ఆర్డినరీ ఫెలో జీవించడానికి ఎంత యమయాతనలు పడుతున్నాడో కాస్త పరికించి చూసిచెప్పండి. అసలంతదాకా ఎందుకు— మన కడుపులో ఎంతకుళ్ళు పేరుకుందో మనకు తెలీదు. మన బుర్రల్లో ఎంత మట్టివుందో అదెప్పటికీ బైటపడదు. మన శరీరాలు ఎంతసోపుతో కడిగినా మళ్లీ మకిలిపట్టి చెమటకంపు కొట్టకమానవు, అందుకే మంచి గంధం, మల్లెపూలు, సెంట్లూ, వాసననూనెలూ, జలతారంచు కోకలూ, జరీకోట్లూ, లాంకోట్లూ, పాంకోళ్ళూనూ. దట్సాల్! జీవితం బోరుకొడ్తోం దని ఒప్పుగుంటారా— అలా రండి దారికి. హితోపదేశాలూ, పాపపుణ్యా లలెక్చర్లూ, అసభ్యత, అశ్లీలం అని దొంగకబుర్లు చెప్పకండి. ఒక ఆట ఒక మంచి పాటా, ఒక కప్పు కాఫీ, మంచి సరదాగా చదువుకునే పుస్తకం, నల్లులులేని మంచం, పర్సులో పదిరూపాయల నోటూ, మనసులో కాస్త మంచితనం, గుండెలో కాస్త జాలీ, వుండాలంటారా అక్కర్లేదంటారా? లాభనష్టాల జోడుగుఱ్ఱాల బండి ఎక్కి తిరుగుతున్నారు మీరు. మరి పాపపుణ్యాల ప్రసక్తి తేకండి! ఐ హేట్ శర్మన్స్.